## [illegible]

నేను కాఫీ హోటలులో ప్రవేశిస్తూ ఉండగా, ఒకడు బయటకు వస్తూ బిగ్గరగా అటుస్తున్నాడు. అరగంట కూర్చున్నా, సెర్వర్ ఎవ్వరూ వచ్చి నీకేమి కావాలని అడగలేదని దాని సారాంశం. ప్రొప్రయిటరు వింటూ అతనిని వెళ్లిపొమ్మని నాతో కూడా లోపలికి వచ్చాడు. "పాపం: అతనితో అల్లా అన్నారే"మన్నాను. యజమాని నవ్వుతూ "ఒకరోజు వచ్చే కస్టమరుకోసం, మా వర్కరుతో తగూపెట్టుకుంటామా? అతడేనెమ్మదిగా వచ్చి నాతో చెబితే నేనేదో సర్ది చెప్పేవాణ్ణి; అరుస్తున్నాడు;" అన్నాడు.

నా టేబిల్‌దగ్గరే సీటులేక ఒకడు నిలబడి కాఫీ త్రాగుతున్నాడు. కప్పు అడుగునుండి, కాఫీ బొట్లు రాలుతున్నాయి. "అసలు ఇచ్చేది కాస్త! అందులో పాతికవంతు పగిలిన కప్పులో కారిపోతుంది!" అంటూ, గబగబా త్రాగేసి బిల్లు చెల్లించి వెళ్లిపోయాడు. అప్పుడే

## వర్కర్



వచ్చి, ఆ మాటలు విన్న సెర్వర్ దాని నెత్తిచూశాడు. పగులుఉంది. బల్లమీద కొట్టాడు. మూడు ముక్కలయింది. దానిని అతడు క్లీనర్ ప్లేటులో పారవేసి వెళ్లిపోయాడు. కొద్ది గజాలనుంచి యజమాని దానిని చూచి, సెర్వర్ వెళ్లిన తర్వాత అక్కడకు వచ్చాడు. "మీ వర్కర్, కప్పు బల్లమీద బ్రద్దలుకొడుతూ ఉంటే, చూస్తూ ఊరుకున్నారే? అతడు మీకు చూపించి, ఇంకొక కప్పు కావాలని అడగాలి కదా!" అన్నాను. "పగిలినదే, బ్రద్దలుకొట్టాడు కదా!" అన్నాడు, నవ్వుతూ. "మీరే పగిలిన కప్పు ఎందుకిన్నాళ్లట్టే పెట్టారు?" "ఇది వ్యాపారం! జరిగినన్నాళ్లు దానితో జరుగుతుంది-క్రొత్తది కొనవక్కర లేకుండా! అయినా పంతులుగారూ! అతడల్లా చేయడం నాకు బాధగా లేదంటారా? వర్కర్లతో పేచీ పెట్టుకుంటే హోటలు నడవదు. తినేవాళ్లు కాసేపు కూర్చొని లేచి పోతారు. వీళ్లు సమ్మెచేస్తే మాకు అంతా లాస్." అన్నాడు, నవ్వుతూ నెమ్మదిగా యజమాని.

—పైడిపాటి సుబ్బరామశాస్త్రి

# అనామకుడి డైరీ

—వేమరాజు నరసింహారావు

## అరసున్నాలు, నిండుసున్నాలు

కాకినాడ కాలేజీలో మాకు తెలుగు లెక్చరర్ శ్రీమాన్ ఈయుణ్ణి వీరవెంకట రాఘవాచార్యులుగారు.

కాలేజి పిల్లలు తమ మేష్టర్లకి గాని, ఆడ పిల్లలకి గాని, ముద్దుపేర్లు పెట్టుకోకుండా వుండలేరు గనక, ఆయన్ని "అరసున్నాల ఆచార్యులుగారు" అనే బిరుద నామంతో ఆప్యాయంగా వ్యవహరించే వాళ్లం.

విద్యార్థుల సాహితీ సౌరభాన్ని మరింతగా గుబాళింప చేయాలంటే, అరసున్నాల్లాంటి "పోపుసామాను" అత్యవసరం అని ఆచార్యులు గారి అభిప్రాయం. పోపు పెట్టితేనేగాని గుబాళింపులేని విధంగానే, అరసున్నాలు లేని తెలుగు వ్యర్థం అనీ, రుచి పచీలేని వంటకం అనీ, వారి అభిప్రాయం.

అందుకని, విద్యార్థులకి జ్ఞాపకం వుండే విధానంలో, వారు "ఒరే', 'కంట'లో అరసున్నా వుంది, చూసి కూచోండి" అనో, "పెరుఁగు'లో అరసున్నా వుంది చూసుకుని తినండి" అనో, హాస్య స్ఫోరకంగా మాకు అరసున్నాల ఆంతర్యం వివరించే వారు.

సమాజానికి పూర్ణానుస్వారాల విలువ ఎంతవుందో, అర్ధానుస్వారాల విలువా అంతే గదా! రాజకీయాల్లో గాని, నిత్య జీవితాల్లోగాని, పూర్తి సున్నాగాళ్లు, అరసున్నాగాళ్లు ప్రాముఖ్యం వహిస్తూనే వున్నారు గదా!

సాహిత్యంలో కూడా, నిండుసున్నాలకి, అరసున్నాలకి అంతే ప్రాముఖ్యం వుంది మరి!

చిత్రమేమిటంటే వ్యాకరణం రూల్సుకి లోబడి అరసున్నాలు నిండుసున్నాలవుతాయి, నిండుసున్నాలు అరసున్నాలవుతాయి.

జీవితంలో అవసరాన్నిబట్టి అలాగే అవుతూండడం మనకి అనుభవైకవేద్యమే గదా మరి!

చెవికి యింపుగావున్న ప్రయోగం ఏదైనా వ్యాకరణ శాస్త్రరీత్యా, దోష రహితమైనదని గదా సిద్ధాంతం! అలాగే, స్వార్థానికి, అవసరమయిన మార్పులు (అంటే నిండుసున్నాగాళ్లు అరసున్నాగాళ్లవడం, అరసున్నాగాళ్లు నిండుసున్నాలు అవడం, అన్నమాట) నిషిద్ధంగాదు, అని రాజకీయవాదుల సిద్ధాంతం!

"మృచ్ఛ కటికమ్" నాటకానికి ఆచార్య దివాకర్ల వారి తెలుగు అనువాదం అప్పుడు మాకు పాఠ్య గ్రంథం. ముద్రణలో అచ్చుతప్పులు విరివిగానే పడ్డాయి. (యుద్ధం రోజులు గదామరి!)

అందులో "నీ కూఁతురు" అని వుండాల్సింది, ముద్రారాక్షసంతో "నీఁకూతురు" అని అచ్చయింది.

ఇంతకంటే మంచి ఛాన్సుమరి రాదని, నేను క్లాసులోలేచి నుంచుని, ఆలోపాన్ని ఎత్తి చూపించాను.

"మాష్టారు! 'కూతురి'కి పెట్టవలసిన అరసున్నా, 'నీకు' పెట్టాడండీ! ఎందుకని?" అని అడిగాను అమాయికంగా.

క్లాసంతా ఒక్కసారి గొల్లుమన్నారు.

ఆచార్యుల వారు ఒక్క అరనిమిషం అవాక్కయి, అవునోయ్, పొరపాటే! అన్నారు.

మళ్లీ గొల్లుమన్నారు.

ఆచార్యులవారి ఆదేశం మేరకు అరసున్నాల్ని విరివిగా ప్రయోగించి, నా రచన్ని మరింత గుబాళింప చేయడానికి నిశ్చయించుకున్నాను.

ఆచార్యులవారి చిట్కా పోపుడబ్బాలో మాదిరి అరసున్నాల్ని ఒక డబ్బాలో వేసుకుని, రాయడం అంతా అయిపోయాక, అక్కడక్కడ జల్లితే, రచన ఘుమ ఘుమలాడుతుంది, అని చమత్కరించారు.

ఆంధ్ర విశ్వ విద్యాలయంలో బి.ఏ. తెలుగులో రాష్ట్ర ప్రథముడిగా నాకు ప్రభల సుందరరామయ్య పంతులు గారి బంగారు పతకం లభించింది. రిజిస్ట్రారుగారు నాకు మెడల్ వచ్చిందని రాస్తే ఆదిలో అది తెలుగులో వచ్చిందని నమ్మబుద్ధి కాలేదు.

"ఎకనామిక్స్"లో అది వచ్చిందని నానమ్మకం. అందుకని అడిగిన వాళ్లకీ, అడగని వాళ్లకీ, "ఎకనామిక్స్"లో గోల్డ్‌మెడలిస్ట్ అని చెప్పుకోవడం గర్వంగా వుండేది.

తరవాత కొందరు తెలిసిన మిత్రులు అనుమానం వెలిబుచ్చగా, రిజిస్ట్రారు గారిని అడిగి తెలుసుకున్న తరవాత, తెలుగులో యింత పాండిత్యం గలవాణ్ణి, ఎనిమిది భాషల్లోనూ అనువాద ప్రక్రియలోనూ ఉద్దండులయిన మాతాతగారు బ్రహ్మశ్రీ అత్తిలి సూర్యనారాయణగారికి స్వయానా మనవణ్ణి, నాకు రాకేం చేస్తుంది, అని నన్ను నేను సముదాయించుకున్నాను.

అయితే యీ బంగారు పతకం, నా అరసున్నాల ప్రయోగ ప్రావీణ్యత వలననేనని ఎవరైనా అనుకుంటే అదిశుద్ధ పొరపాటు!

అరసున్నాల విద్యలో ఆచార్యుల వారివద్ద చక్రాంకితాలు స్వీకరించిన నేను, తరవాత వ్రాసిన వ్యాసంలో, విరివిగా వాడి, పోపు డబ్బా అంతా ఖాళీ చేసేశాను.

దాంతో, ఆవ్యాసం దిద్దిన మరో మాష్టారు, బెంబేలు పడిపోయి, దానిమీద యిలా వ్రాశారు:

"నీవీ అరసున్నాలను మాని వేయుము. లేనిచో తత్ఫలమనుభవించెదవు"

నేను తరవాత అరసున్నాల్ని పూర్తిగా మానేశాను.

నీతి: అరసున్నాలు, నిండుసున్నాల జోలికి పోనేల! తత్ఫలమనుభవింపనేల!